# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ పాటు మరో రెండు రాష్ట్రాల్లో సెమీకండక్టర్ తయారీ కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**
2. **ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి 81 వేల 317 కోట్ల రూపాయల పనులను ప్రతిపాదించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.**
3. **భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో సెప్టెంబర్ నుంచి క్యాన్సర్ సర్వేను నిర్వహించనున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.**
5. **తెలంగాణలో హ్యామ్ విధానంలో రహదారులను అభివృద్ధి చేస్తున్నామని రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు.**

=========================

ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో రెండు రాష్ట్రాల్లో సెమీకండక్టర్ తయారీ కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న సమావేశమైన కేంద్ర మంత్రి వర్గం నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. ఒడిశా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్‌లలో 4 వేల 6 వందల కోట్ల రూపాయల వ్యయంతో సెమీకండక్టర్ తయారీ యూనిట్లు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. ఈ ప్రాజెక్టులతో దేశంలో సెమీ కండక్టర్ల తయారీకి గణనీయమైన ప్రోత్సాహం లభిస్తుందని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 31 సెకన్లు

ఇదిలా ఉండగా సెమీకండక్టర్ తయారీ యూనిట్లకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. సెమీకండక్టర్ల ఉత్పత్తిలో భారత్ వేగంగా పురోగమిస్తోందని, ఈ ప్రగతి అంతర్జాతీయంగా నవీన ఆవిష్కరణలకు అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తుందని తెలిపారు.

మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు సెమీ కండక్టర్ యూనిట్ ను కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి,

కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం కోసం 81 వేల 317 కోట్ల రూపాయల పనులను ప్రభుత్వం ప్రతిపాదించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ– సీఆర్డీయే అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాజధానిలో ప్రస్తుతం 50 వేల 552 కోట్ల రూపాయల పనులకు టెండర్లు పిలిచామని చెప్పారు. 74 ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యాయని భవనాల నిర్మాణాలు, మౌలిక సదుపాయాలతోపాటు రహదారులు, వరద నియంత్రణ పనులు కూడా చేపట్టామని వెల్లడించారు. నిర్ణీత సమయంలో రాజధాని నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి దృశ్య మాధ్యమం ద్వారా నిన్న సమీక్ష నిర్వహించారు. మూడు రోజుల పాటు అన్ని శాఖల ఉద్యోగులకు సెలవులు రద్దు చేయాలని ఆదేశించారు. ఆకస్మిక వరదలకు సంసిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో వరదలపై హైడ్రా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఐటీ ఉద్యోగులు ఇంటి నుంచి పనిచేసేలా అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్ష సూచన దృష్ట్యా తెలంగాణలోని ఐదు జిల్లాల్లోని పాఠశాలలకు ఈ రోజు, రేపు సెలవులు ప్రకటిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని పాఠశాలలకు సెలవులు ప్రకటించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో పులివెందులలో 76.44 శాతం, ఒంటిమిట్టలో 81.53 శాతం ఓటింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. ఈ నెల 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. కాగా పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక కు సంబంధించి 3, 14 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రీపోలింగ్ నిర్వహించనున్నారు. ఈ పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం వెయ్యి మంది ఓటర్లు ఉన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సెప్టెంబర్ నుంచి క్యాన్సర్ సర్వేను నిర్వహించనున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లి, పిల్లల ఆరోగ్య కేంద్రాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

తెలంగాణలో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ –హ్యామ్ విధానంలో రహదారులను అభివృద్ధి చేస్తున్నామని రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని న్యాక్ కార్యాలయంలో హ్యామ్ రహదారులపై నిర్వహించిన 'రోడ్ షో' కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 7 వేల 947 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్లు, 5 వేల 190 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ రోడ్లను హ్యామ్ విధానంలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే మారుమూల ప్రాంతాలు, తండాలకు రహదారి సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు.

---------------------------

సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భద్రత, సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖా అధికారులతో నిర్వహించిన సదస్సులో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల అభివృద్ధికి 3 వందల కోట్ల రూపాయలను కేటాయించామని తెలిపారు. సంక్షేమ వసతి గృహాల్లో చదివే విద్యార్థుల 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.

---------------------------

'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలులో అతి పెద్ద జాతీయ జెండాతో ర్యాలీని నిర్వహించారు. స్థానిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 11వందల మీటర్ల త్రివర్ణ పతాకంతో విద్యార్థులు చేపట్టిన ర్యాలీని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ప్రారంభించారు. ఈ ర్యాలీలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు పాల్గొని ధృవ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో గుజరాత్‌లో 3 వేల 2 వందల అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ చేయగా.. కర్నూలులో 3 వేల 5 వందల అడుగుల త్రివర్ణ పతాకంతో ర్యాలీ చేసి రికార్డు నెలకొల్పామని వెల్లడించారు.

---------------------------

పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో ఈరోజు అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులపాటు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ..

..వాయిస్.. 30 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ అల్పపీడన ప్రభావంతో ఈరోజు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

దేశ భవిష్యత్తుకు యువత మూలస్తంభాలని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో నిర్వహించిన 'కోనసీమ యువ సమ్మేళనం'లో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో, యువతలో ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని చెప్పారు. రాష్ట్రంలో పది లక్షల కోట్ల రూపాయల

పెట్టుబడుల ద్వారా 8 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి వివరించారు.

---------------------------

క్షేత్ర స్థాయిలో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో పలు అభివృద్ధి కార్యక్రమాల పనులను మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బనగానపల్లెలో కోటి 27 లక్షల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికే దాదాపు 50 శాతం పూర్తైయ్యాయని చెప్పారు. మిగిలిన అభివృద్ధి పనులను ఒక నెల వ్యవధిలో పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని మంత్రి తెలిపారు.

=======================